
# ప్రతీకారం

ఎ యశ్వీరమణారావు



నడుస్తోన్న నా కళ్ళు కట్టేసినట్టు ఆగిపోయాయి. రెప్పవెయ్యటం కూడా మరిచిపోయి చూపుతిప్పుకోలేక నిలిచిపోయాయి నా కళ్లు. కెరటంలా ఉవ్వెత్తున పొంగిన రక్తం పచ్చటి మొహంలోకి ఎర్రగా తన్నుకొచ్చింది తెలియని ఏదో ఆవేశం నరనరాల్లోంచి పాకి పిడికిట్లో బిగుసుకుంది.

ప్రాచీన వైభవాలను శిథిలావస్థలో కూడా ప్రదర్శించుకుంటూ: ఎత్తయిన అరుగులతో, విశాలమైన లోగిళ్లతో, పసుపురాసుకుని పారాణి దిద్దుకుని పచ్చటి మామిడాకుల తోరణాలతో కళకళలాడే నిలువెత్తు గుమ్మాలతో, నడలిపోతున్న

తీవిని కూడతీసుకుంటూ, ఆ వీధికంతటికీ దర్పంగా నిలబడ్డ ఆ పెంకుటింటి వరవ లోంచి అరుగుమీదకి—

అప్పుడే విచ్చుకుంటున్న మల్లె మొగ్గలా

విరబూయడానికి సిద్ధంగా వున్న ముద్దమందారంలా

ప్రకృతిలో పరిమళాన్ని వొంటికి పూసుకు తిరిగే గాలితరగలా

కెరటాల అంచులమీద విరిగిపడే వెన్నెల కిరణంలా

తొలిసారిగా భూమిమీదకు చొచ్చుకు వొచ్చే ప్రత్యూష కాంతిపుంజంలా

సుమధుర నాదంలా

పవిత్ర వేదప్రవచనంలా

సృష్టిలో అణువణువునా పొదగబడి వున్న అందానికంతటికీ నిర్వచనంలా

పడిచొచ్చిన ఆ అమ్మాయిని చూసిన క్షణం— అస్తవ్యస్తంగా, అల్లకల్లోలంగా వున్న నా ఆలోచనలకో రూపం ఏర్పడింది.

• • •

కాలానుగుణంగా ఎన్నో రీతుల వొస్తోన్నమార్పుల ప్రభంజనానికి ఎక్కడా చెక్కుచెదరకుండా— సుశిక్షితమైన సనాతన ధర్మాన్ని పురాతన సాంప్రదాయపు ఉక్కుపిడికిట్లో పరిరక్షించుకుంటూ— వారసత్వపు ఆస్తిపాస్తులతోపాటుగా సంక్రమిస్తూ వొస్తోన్న ఆచారవ్యవహారాలను కట్టుదిట్టమైన పద్ధతులలో నిర్వర్తించుకుంటూ— భిన్నమైన అభిప్రాయాలకుగాని స్వతంత్రమైన ఆలోచనలకు గాని ఏ వొక్కరికీ అవకాశమే రానీయనంత క్రమశిక్షణలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థని తరాల హయాంనుంచీ కాపాడుకుంటూ—

అందుకోసమే ఇంకా ఊపిరి మిగుల్చుకున్న—

ఆ వంశవృక్షంలో ఏడుతరాల తర్వాతా, నాలుగు తరాల వెనుకా, అంకురించిన— అన్నప్ప దీక్షితులు గారి హవేలీ అది.

ఆయన ముద్దు మనుమరాలు—ఆ అరుగుమీదనుంచున్న పద్దెనిమిదేళ్ళపసిడి మొగ్గ.

—పదిహేనేళ్ళక్రితం ఈ ఊరు విడిచిపెట్టి నేను వెళ్ళిపోయినాటికి సరిగ్గా మూడేళ్ళ వెనక ఆ ఇంట కురిసిన ముత్యపు చినుకు ఆమె.

అన్నప్పదీక్షితులుగారి ముగ్గురు కొడుకుల్లోనూ పెద్దవాళ్ళిద్దరూ నిస్సంతులయిపోగా మూడో కొడుకు కడుపున చిట్ట చివరకు మిగిలిన వంశాంకురం ఆ చిన్నది.

ఆ ఇల్లూ, ఆ మనుష్యులూ. ఆ ఆచార వ్యవహారాలూ, అన్నీ నాకిప్పటికీ జ్ఞాపకం. అవన్నీ గుర్తుంచుకుని మళ్ళీ ఈ ఊరికి తిరిగిరావాలని గట్టి నిర్ణయం తోనే ఈ వూరొదిలిపెట్టి వెళ్ళిపోవాల్సి వొచ్చిన పదిహేనేళ్ళ వెనకటి పరిస్థితి

ఇంకా బాగా జ్ఞాపకం నాకు ఆ పరిస్థితి ప్రోద్బలమేనా ఈ ఎదుగుదల

పదిహేనేళ్ల కఠోరతపస్సులో నేను సాధించింది వొక ఎత్తు అయితే—

ఇప్పుడు ఈ వూరొచ్చి నేను సాధించదలచుకుంది అంతకు కానూ— అంతకుమించిందీనూ. నా వేషం, భాష, నడవడికా— నన్ను ఆనవాళ్లు పట్టలేనంతగా మార్చివేసింది కాలం ఈ పదిహేనేళ్లలోనూ.

నాకు కావలసిందీ అదే.

చిన్నప్పట్నుంచీ చాలా మాలిమిగా నాతో మసలినవాళ్లే చూచాయగానైనా నన్ను గుర్తుపట్టలేకపోయారు ఎంత పరిశీలించి చూసినా.

ఈ పదిహేనేళ్లలోనూ ఎన్ని యాతనలైనా సహించిందీ ఇందుకే.

తిరిగొచ్చి ఈ వూళ్లో నేను సాధించి తీరాలనుకున్నదీ లాకాయిలూకాయి వ్యవహారం కాదు.

కత్తిమీదసాము అంతకన్నా చాలా తేలికయినది.

'అధునాతనం' అన్న పదాన్ని ఆమడ దూరంనుంచే తరిమికొట్టే అన్నప్ప దీక్షితులుగారి ఎదుటపడ్డమే సాహసం అనుకుంటే—

ఆయన కోటలో పాగావెయ్యాలనుకోవటం దుస్సాహసమే.

అయినా—అందుకు వొడిగట్టడానికే—

భాషాప్రవీణతోపాటు ఎమ్మే తెలుగులో యూనివర్సిటీ ఫస్టు తెచ్చుకున్నా—

అడిగితే చాలు ఏ కాలేజీలోనన్నా లెక్చరర్‌గా ఉద్యోగం వొచ్చే అర్హత పుష్కలంగా వున్నా— వసుదేవుడిలా— అడ్డదిడ్డమైనవాళ్లందరి కాళ్లు పట్టుకుని, ప్రాకులాడి

పదిహేనేళ్ల క్రితం కొట్టు చింపితే అక్షరమ్ముక్క లేకుండా వెళ్లినవాడిని—

పదిహేనేళ్ల తర్వాత, ఈ ఊరికి—

అన్నప్ప దీక్షితులుగారి తాతగారి హయాంలో—

చుట్టూవున్న మూడు జిల్లాలకీ వొకే వొక్కటిగా స్థాపించబడి—

ఇప్పటికీ పూర్వపు ఔన్నత్యాన్ని నిలబెట్టుకుంటూ

ప్రభుత్వపరమైపోయినా—

అన్నప్పదీక్షితులుగారి గౌరవ అజమాయిషీలో నడుస్తోన్న—

ఈ ఊరి సంస్కృత కళాశాలకు—

డైరక్టు రిక్రూట్‌మెంటులో—

ప్రధానోపాధ్యాయుడిగా వొచ్చాను.

* * *

నిరంతరం నిండుగా, నిర్మలంగా ప్రవహించే చల్లటి నదికి వొడ్డున పచ్చటి చెట్ల సందుల్లోంచి మిలమిలా మెరుస్తూ ప్రకృతి వొడిలో దోబూచులాడుతున్నట్టు కనిపించే ఈ పల్లెని—

ఈ ప్రాంతాన్ని వొకప్పుడేలిన ప్రభువులు—

అన్నప్పదీక్షితులుగారి కుటుంబానికి

మాన్యంగా బహూకరించారు.

ఆ కుటుంబంలో చాలా వెనకటి తరం వా డ యి న అన్నప్పదీక్షితులుగారి హయాంలో మాన్యంగా వొసగబడ్డ ఆ పల్లెకు 'అన్నయ్యాగ్రహారం' అనిపేరు.

బయట ప్రపంచంతో సంబంధం లేనట్లుఎక్కడో వచ్చటి ప్రకృతివొడిలో- గాలీ, నీరూ, పంటా పుష్కలంగా ప్రసా దిస్తూ వుండిన ఆ అగ్రహారంలో వొక చక్కటి సంస్కృత పాఠశాల నెల కొల్పి ప్రాచీన భాషావిలువల్ని భావితరా లకు అందించాలనే కాంక్షయంతో అప్పటి ప్రభువుల సహకారంతో అన్నప్ప దీక్షితులవారి కుటుంబంవారు ఆంధ్రదేశా నికి మిగిల్చిన గొప్పవరం ఈ సంస్కృత పాఠశాల।

కాలగర్భంలో రాజుల పరిపాలనలు చెల్లిపోవటంతోపాటు మాన్యాలూ ఆ మాన్యాలను ఏకఛత్రాధిపత్యంతో ఏలిన బ్రాహ్మణవంశాలూ శిథిలమైపోయినా అన్నయ్యాగ్రహారం ఇంకా వైభవంగా వెలుగొందడానికి ముఖ్యంగా కారణాలు రెండు—

ఆంధ్రదేశంలోవున్న సంస్కృత భాషాబోధనా విద్యాలయాల్లోకెల్లా తల మానికంగా వున్న ఈ ఊరి సంస్కృత కళాశాల వొకటి—

శిష్టసాంప్రదాయలకు ఊపిరిగా మిగి లున్న అన్నప్పదీక్షితులుగారు రెండో దీనూ. చల్లటి నదివొడ్డున పచ్చటి చెట్ల మధ్య ప్రశాంతమైన ప్రకృతి వొడిలో నిర్మలంగా నవ్వే పసిపాపలా వుండే ఆ అగ్రహారానికి కుడివైపు మూడెకరాల మామిడితోటలో వెదురుబద్దలతో కట్టిన కుటీరాల్లోనూ, ఆరుబయట విశాల మైన చెట్లకింద మెత్తటి పచ్చికబయళ్ల మీదా సూర్యోదయంతో ప్రారంభమై సూర్యాస్తమయం వరకు స్వచ్ఛమైన గొంతుల్లోంచి స్పష్టంగా సుమధుర నాదంలా ఆ ప్రాంతమంతా పునీతంచేస్తూ సాగే వేదాధ్యయనం ప్రకృతిలో ప్రతి ధ్వనిస్తోంటే పరవశించి పులకించి పోతూంటుంది ఆ ఊరువాడా।

ప్రాచీన యుగాలలో మహర్షుల ఆశ్ర మాలలో నడిచే గురుకులవాసాలు గుర్తుకు తెస్తాయి ఆ విద్యాలయ పరిసరాలు।

నాగరికత పేరుతో వెర్రితలలు వేస్తో న్ననగర జీవితంలో యాంత్రికంగా తయారయిపోతున్న మనుష్యులకు ఈ పల్లెపట్టు వో భూతలస్వర్గంలా తోస్తుంది


చీకూ, చింతా ఏ కోశానా కనపడని ఈ ఊరూ—

కాలుష్యం మాటే ఎరగని ఇక్కడి స్వచ్ఛమైన గాలీ—

మున్నూటరవయిరోజులూ అమృతం లాంటి నీటిని ప్రసాదించే ఈ చల్లటినదీ—

అభిమానం తప్ప ద్వేషం ఎరుగని ఇక్కడి మనుష్యులూ—

ప్రతీ క్షణం ఆహ్లాదం కలిగించే పరి సరాలూ—



పదేళ్ల నా బాల్య జ్ఞాపకాలు!

అయితే—

నన్నీ ఊరు మళ్లా లాక్కొచ్చినదీ—

ఆ తీపిగుర్తులు మాత్రం కావు!

* * *

గుమ్మంమెట్లు ఎక్కుతూన్న నన్ను చూసి—

వెనక్కి తిరిగిన ఆ మెరుపు తీగ వొత్తయిన పొడుగాటి మెత్తటి జడలో విరిసిన మల్లెలు నవ్వుల స్వాగతాలు కురిపిస్తోంటే—

అప్పటిదాకా ఆమె వొంటిని పూసుకు తిరిగిన ఆ అరుగుమీద గాలి నా శరీరంలో అణువణువునీ మృదుమధురంగా తాకుతోంటే—

ఆ మత్తులో పరవశిస్తూ సర్వంమరిచి పోయి నశవగుమ్మందాకా నడిచొచ్చిన నా కాళ్లని—

పదిహేనేళ్ల వెనక గుండెల అట్టడుగున గూడుకట్టుకున్న జ్ఞాపకం వొక్కటి గుండెల్ని చీల్చుకుని సర్రున దూసుకొచ్చి ఆవేశంతో అడుగు ముందుకెయ్యనీకుండా అడ్డేసింది నవ్వుకుని, ఆ జ్ఞాపకపు తీవ్రతని మృదువుగా లాలించి లోపలకు పంపించేస్తోన్న క్షణంలో—

"ఎవరదీ ?" అంటూ లోపల్నుంచొస్తోన్న ఆయన్ని సూరన్నదీక్షితులు గారని గుర్తుపట్టాను.

అన్నప్పదీక్షితులుగారి మూడో కొడుకాయన. 'సూరీడు'గారంటారాయన్ని.

నే నెవరో చెప్పాలనే—

ముఖ్యంగా ఆ ఇంట్లో ప్రతి వొక్కరి గుండెపీ గుచ్చిగుచ్చి చెప్పాలనే వొచ్చిందీ వూరు। అందుకు సమయం సందర్భం కోసం వేసుకున్న ప్రణాళిక కింకా ప్రారంభోత్సవమే కాలేదు— అందుకనే

"వాజపేయయాజుల వారబ్బాయిని .. శివరామదీక్షితులంటారు నన్ను ఈ వూళ్లో సంస్కృత కళాశాలకు ప్రధానోపాధ్యాయుడిగా వేసారు నన్ను బ్రహ్మశ్రీ అన్నప్పదీక్షితులుగారి దర్శనం చేసుకుని వేదోక్తమైన వారి ఆశీర్వచనం పొందాలని వొచ్చాను తమరు అనుగ్రహించి వారి దర్శనం యిప్పించాలి " అన్నాను వినమ్రుడనై దోసిలి వొగ్గి మంచుని.

నాకు తెలుసు సామాన్యులకెలానూ రాదు-కాకలుతీరిన పండితులకుకూడా అన్నప్పదీక్షితులుగారి దర్శనం ఆకాశకుసుమం, అని।

"అలాగా ఈ రోజు వారి తండ్రి గారి ఆబ్దీకం ఆ ఏర్పాట్లలో హడావుడిగా వున్నారాయన మీతో సావకాశంగా మాట్లాడే పరిస్థితి కాదేమో అయినా పైవూర్నుంచి వొస్తానని చెప్పిన భోక్తలలో వొకాయన ఈ ఆఖరు నిముషంలో రావటం పడదని కబురు పంపటంతో చిరాకుగా కూడా వున్నారు ఈ సమయంలో " హఠాత్తుగా వో మెరుపు మెరిసింది బుర్రలో.

"రావటం రాత్రే వొచ్చినా పరిస్థితు అనుకూలించక భోజనం కుదరలేదు ఇప్పటివరకూ మంచితీర్థం తప్ప మరేదీ పుచ్చుకోనూలేదు తమకు అభ్యంతరం లేకపోతే వారి స్థానంలో నన్ను భోక్తగా నాయనగారు ఆజ్ఞాపిస్తే " అన్నాన చొరవ తీసుకుంటూ.

కొద్దిగా ఆదునికంగా వున్న నా వంక కొద్దిగా అనుమానంగా చూస్తోన్న అయన శంక క్షణంలో పసిగట్టి—

"సందేహించక్కర్లేదు తమరు మీ కుటుంబ విస్తాగరిష్ఠలు గురించి దహా ముఖంగా ఎరిగున్నవాడిని వటుడిని వైదిక కర్మానుష్ఠానాలన్నీ విధిగా అ రిస్తూ వుండినవాడిని వేదశాఖాల క్షుణ్ణంగా అభ్యసించినవాడిని నాయ గారితో తెలవియ్యండి తమరు వార అనుగ్రహిస్తే నే తమ యింట ప్రాణాహు తులు పుచ్చుకునే అదృష్టం నాకు అనేసరికి—

సూరీడుగారు ముగ్ధులయిపోయినట్ల అయన మొహం పచ్చగా మెరిసింది అంతకన్నా ఆశ్చర్యమయిన సం తేవిటీ అంటే—

నా ఈ మాటలన్నీ నడవకు కు తెంపున్న గదిలో, అన్నప్పదీక్షితులుగార విశ్శద్దంగా వింటూవుండి, నేనావగా గభాల్న నడవలోకి రావటం।

అజానుబాహువు. విశాలమైన వ

స్థలంమీద బంగారు తీగ చుట్టిన రుద్రాక్ష తావళం. చేతులకు బంగారు మురుగులు. విద్వత్సభలను మెప్పించి కాలికి తొడిగించుకున్న గండపెండేరము పచ్చటి భుజాలమీంచి నేలనందుకోవాలని తాపత్రయపడే బరంపురం పట్టుశాలువా. ఎర్రటి కాశీపొత్తుపంచె. ఎనభయ్యోపడి దాటినా సడలని శరీరసౌష్ఠవం– వన్నె తరగని వొంటిరంగు. ఎలాంటి ఉద్దండుడినయినా నిలబెట్టి ఆకట్టుకునే ఆ విగ్రహం—

పదిహేనేళ్ల వెనక నా స్మృతిపథంలో చెక్కుచెదరకుండా వున్నందున—

ఆయన్ని కొత్తగా చూసిన అనుభూతి అయితే కలగలేదు కానీ—

ఆ ముఖంలో వెలిగే అఖండ తేజస్సుకు కొద్దిగా తొట్రుపాటు కలిగింది.

సిద్ధంచేసుకున్న పథకానికి కొద్దిగా జంకు కూడా కలిగేంతలో—

గుండెపొరల్లో బుసలుకొట్టే జ్ఞాపకం వెన్నుతట్టింది!

"మీ గురువుగారెవరబ్బాయీ?" ఠంగుమంటూ ప్రశ్నించిందాయన గొంతు.

అదీ ప్రశ్న. ఎక్కడేనా విద్వత్తు ఎదురయితే విద్వాంసుడన్నవా డడగవలసిన ప్రశ్న అదీ.

"వరసింహయజ్వగారని..." నామాట పూర్తికాలేదు

"తెలుసు. లోపల బావిదగ్గర స్నానం చేసి మడికట్టుకో" అనేసి లోపల కెళ్లిపోయారాయన.

సూరీడుగారు వాత్సల్యంతో లోపలకు తీసుకెళ్లారు నన్ను.

'గుహలో జొరబడ్డట్టే' అనుకున్నాను మనసులో

* * *

భోజనాలుకావడం తడవు– ముగ్గురు కొడుకులనూ కూర్చోపెట్టుకుని—

శాస్త్రంలో, తర్కంలో, వ్యాకరణంలో నా సత్తా ఏపాటిదో పరిశీలించదలుచుకున్నారు అన్నప్ప దీక్షితులుగారు.

నలుగురూ ఉద్దండులే.

మహాయోధులై కమ్ముకొచ్చారు.

ఊపిరి తీసుకునే అవకాశమే ఇవ్వలేదు నాకు.

యూనివర్సిటీ పరీక్షలు రాసేటప్పుడు కూడా ఇంత కష్టం ఎదుర్కోలేదు నేను.

సర్వతోముఖమైన పాండిత్యం వారిది.

ఎంతటి పండితుడి వాదనైనా పూర్వపక్షంచేసి నెగ్గుకురాగల సమర్థులు. నిజానికి వాళ్లముందు నేను కూర్చోడం హనుమంతుడి ముందు కుప్పిగంతులు వెయ్యటం లాంటిదే. అందుకు సిద్ధపడ్డం సాహసంకాక?

ఎలా నెగ్గుకొచ్చానో నాకు తెలీలేదు.

అదో పూనకంలాంటి స్థితి!

దీపాలు పెట్టటం కూడా తెలీలేదు ఆ యుద్ధంలో.

"శభాష్" వొక్కముక్కతో సంపూర్ణమైన తమ సంతృప్తిని ప్రకటిస్తూ

నా భుజం తట్టారు అన్నప్ప దీక్షితులు గారు. ముగ్గురు కొడుకులూ ఆ ప్రశంసకు ముచ్చటపడ్డారు.

వారిదగ్గర శెలవు పుచ్చుకోడానికి లేచిన నన్ను చూసి,

"ఎక్కడ బసచేసావబ్బాయీ?" అని గారు అన్నప్పదీక్షితులుగారు చాలా మార్దవంగా.

"రాత్రి పాఠశాలలోనే పడుకున్నాను రేపేదైనా వ్యాపకం చేసుకోవాలి" అన్నాను.

అన్నప్పదీక్షితులుగారు వో క్షణం ఏం మాట్లాడలేదు.

తండ్రిగారి ఆలోచనని పసిగట్టిన వారి పెద్దబ్బాయి రామచంద్ర దీక్షితులు గారు— "ఇంత లోగిలి వుండగా వేరే ఎక్కడో బసచెయ్యడ మెందుకూ?" అన్నారు.

"అవును. నువ్వు మా యింట్లోనే వుండొచ్చునబ్బాయి" అన్నారు అన్నప్ప దీక్షితులుగారు.

"మీకు అనవసరమైన శ్రమ" అన్నాను మొహమాటంగా.

"అనిమేం అనుకోవడంలేదు. సూరీడూ పీధి గది ఖాళీచేయించు" అంటూ లేచిపోయారు అన్నప్పదీక్షితులుగారు, మరో మాట కవకాశం యివ్వకుండా.

"పదండి మీ సామాను తెచ్చుకొద్దాం సప్తమి ఘడియలు మించిపోక ముందే" అన్నారు రెండో అబ్బాయి లక్ష్మీనారాయణ దీక్షితులుగారు.

కోటలో పాగావెయ్యగలిగాను.

నా విద్యాప్రాభవంతో మెప్పించి మన్ననలు పొందాను

అయితే—

నేను ఆకర్షించుకోవాల్సింది పీళ్లని కాదు.

అసలా ప్రయత్నం ప్రారంభం కాలేదు, ఇంకానూ,

రాజాంతఃపురాల్లో కన్నా కట్టుబాట్లూ, శాసనాలూ తీవ్రంగా వుండే శిష్టుల లోగిట్లో అదంత సులువూ కాదు.

సాధించానా—

తర్వాతుందసలు రాద్ధాంతవంతానూ.

అప్పుడు జరగబోయే దానిముందు ఇందాకట్లా జరిగిందసలు యుద్ధమేకాదు.

దానికి పీళ్ల నలుగురే కాదు, ఊరూ వాడా ఏకమయి నిలవొచ్చు.

మారణహోమమే అవుతుందది.

అందుకు సమిధనవడానికేనా నేను సిద్ధంగా వున్నాను.


• • •

సాయంకాలం కాగానే ఎన్ని పను లున్నా పక్కకు పెట్టి ఇంటికొచ్చేసేవాడిని.

ఆ సమయంలో తండ్రీకొడుకులూ శంకరమఠంలో వుంటారు

తోడికోడళ్లు ముగ్గురూ రాత్రి వంటకి ఆయత్తపడుతూ వుంటారు.

ఏ మాత్రమయినా పీలంటూ దొరికితే అలాంటప్పుడే.




వొచ్చి పది దినాలవుతోన్నా ఎదట వడింది రెండుమాట్లో మూడుమాట్లో. పెదవివిప్పిపలకరించిందే లేదింతవరకూ.

ఆ కళ్లకొసల పూచే చిన్న నవ్వు పువ్వులు మాత్రం గమనించాను.

నా వునికి స్థిరపడ్డట్టే.

చొరవంటూ చేస్తే నేనే చెయ్యాలి.

అందుకోసమే సాయంకాలాలు ఈ మాటు.

—ఆ సాయకాలం గుమ్మం ఎక్కి నా గదిలోకి వెళ్లబోతున్నవాడిని

"ఎవ్వడు మీదెఱుంగక యధేచ్ఛ
సుఖైక రతిం జరింపఁగా
నవ్వలవంశహాని వ్రతహానియశోధన
హానిపుట్టుఁ "

లోపల్నుంచి తియ్యటి కంఠంతో, స్వచ్ఛమైన ఉచ్చారణతో చదువుతోన్న పద్యం వినబడి, ఆగి, ఆసాంతమూ పరవశంతో వింటూ, నడవగుమ్మందగ్గర నిలబడిపోయాను

చటుక్కున అర్థంస్ఫురణకొచ్చి గతుక్కుమనిపోయాను.

పద విభజన చేస్తూ తాత్పర్యం చెప్తున్నారు రామచంద్ర దీక్షితులుగారు.

ఏఁవయితే అదయిందని లోపలకెళ్లాను.

నన్ను చూడగానే లోపలకెళ్లిపో డానికని లేవబోతున్న ఆమెను వారిస్తూ—

"కూర్చోమ్మా పరవాలేదు" అంటూ "రండిరండి వొంట్లో బాగోలేక నే వివాళ

మతాని కెళ్ళలేదు. మా అమ్మాయి నెరుగుదురు కదా. మన యిళ్ళల్లో ఆడపిల్లల్ని చదువుకోసం బయటకు పంపే ఆచారం లేదుకదా. ఇంట్లోనే చదువుతున్నది" రామచంద్రదీక్షితులు గారంటోంటే ఆ అమ్మాయి వొంచుకున్న మొగంలోంచి వెడల్పాటి కళ్లు నన్ను గమనిస్తున్నాయి

"మీ యింటివి మించిన విద్యాలయం ఎక్కడుంది? పద్యం చదవటంలోనే గమనించాను ఈమె విద్యాకౌశల్యాన్ని. పరీక్షల్లో ఉత్తీర్ణులవడమే విద్యాప్రమాణమనుకునే దౌర్భాగ్యస్థితిలో వున్న విద్యాలయాల్లో పొట్టకూటి చదువులు తప్ప మేమేం చెబుతున్నామూ?" అన్నాను

"విలువయిన మాట శెలవిచ్చారు" అంటోన్న ఆయన్నడ్డుకుని—

"ఎందులో అయినా మీ కంటే శతాధికం చిన్నవాడిని. మీరు నన్నలా మన్నిస్తూ మాట్లాడటం నాకు కించగా వుంది" అన్నాను.

ముగ్ధ దయే పోయాడాయన ఆ ముక్కకి.

"ఆ సమయాని కొచ్చారు. మీతో చెబుదామనే అనుకుంటున్నాం మా ముగ్గురన్నదమ్ములమీ. వర్షాలు ప్రారంభమయ్యాయి కదా వ్యవసాయప్పనులతో మాకింక ఊపిరి సలపదు. తెలుగులో వున్న పంచకావ్యాలూ చదువుకోవాలని అమ్మాయి అభిలాష. ఈ మనుచరిత్రతో నాలుగు పూర్తిచేసింది. ఇహ మిగిలింది ఒక్కటే. శృంగార నైషధం. శ్రీహర్షుడి సంస్కృతమూలమూ శ్రీనాధుడి తెలుగు కావ్యమూ జోడించి చెప్పాలి మీరు మీకు వీలయినప్పుడల్లా"

శబ్బాష్.

నేర్చుకునే పద్దెనిమిదేళ్ల ప్రాయంలో మిసమిసలాడే అందమైన అమ్మాయి.

చెప్పబోయేది అద్యంతమూ రసవత్తరమైన శృంగార నైషధము.

చెప్పదివాడు పాతికేళ్ళ నవ యువకుడు.

ఎంతమంది గురువులకి వరం లభిస్తుంది?

"మీ శిష్యురాలిమీద మీ కనుమానం అక్కరలేదు. సంస్కృత పంచకావ్యాలూ క్షుణ్ణంగా మా నాయనగారి దగ్గర చదువుకున్నది" రామచంద్ర దీక్షితులు గారి మాట విని తన్మయత్వంలోంచి బయటపడి,

"అనుమానం శిష్యురాలి మీద కాదండీ ఈ గురువుమీదే. సంస్కృతాంధ్ర భాషలకు ఆదిగురువులైన అన్నప్పదీక్షితులుగారి మనుమరాలికి పాఠం చెప్పడమూ అంటే" అంటూన్న నా మాటలకి—

ఎర్రటి ఆమె పెదవులమీంచి విశ్రబ్ధంగా జారిన నవ్వొక్కటి— ముసురుకుంటోన్న సంజచీకట్లను వెలిగించే కాంతిరేఖలా తళుక్కుమంది.

"మా మనోజ్ఞ మరీ అంత పెంకెపిల్ల

గాదు లెండి " వెనకనుంచి నవ్వుతూ అంటోన్న సూరన్న దీక్షితులుగారి రాక గమనించనేలేదు.

"పాండిత్య ప్రకర్షతో కూడిన పెంకె తనం వున్న శిష్యులున్నప్పుడే గురుత్వా నికో విశిష్టత అయినా తమ అజ్ఞ అయింది కనుక సాహసించక తప్పదు నాకు "

చీకట్లోకూడా మెరిసే ఆమె కన్నుల వంకే చూస్తూ అంటోన్నంతలో—

"ఏవిటీ సాహసం(వూ "అంటూ లోపలకొచ్చారు అన్నప్పదీక్షితులుగారు.

''మన మనోజ్ఞకు పాఠం చెప్పటం " అన్నారు లక్ష్మీనారాయణ దీక్షితులు గారు.

"అవునవును అలా ముంగిలా వుంది కానీ చాల పెంకెపిల్ల నన్నెన్ని తిప్పలు పెట్టిందీ " అన్నారు అన్నప్పగారు మనవరాలివంక చూస్తూ.

అప్పుడామె తాతగారివేపు చిరు కోపంతో చూసిన చూపు కళ్ళున్నవాడు చూడతగ్గది.

"పోండి తాతయ్యా " అంటూ లేవబోతున్న ఆమె తలమీద చెయ్యేసి·

"పోతాను తల్లీ నీ కల్యాణం వాక్కుచే కళ్ళచూసి అందుకోసమే తల్లీ ఈ ముసలిప్రాణం మిగిఉంది " అంటోన్న అన్నప్పగారి కళ్ళల్లో మార్దవ మైన తడి.

"ఏవిటీ నాన్నగారూ దీపాలు పెట్టేవ వేళ అ మాటలూ" సూరీడుగారు నొచ్చు కుంటూ.

"కానీ కానీ తృతీయాశ్వాసం అయిపోవొచ్చింది తర్వాత చదువు " వాక్కు ఈణం (క్షణం) నిశ్శబ్ద మైపోయినవాతావరణాన్ని దారిమళ్లిస్తూ- అన్నారు రామచంద్ర దీక్షితులుగారు

"అవినం జిత్తము జల్లనగా సొరుగు వయ్యంభోజపత్రాక్షిలో " కావ్య మైన అమె గొంతు సాయంకాలపు పిల్ల తెమ్మెరలా అందరి హృదయాలను కుదుటపరిచింది

అశ్వాసానంతరం సమీక్ష, చర్చ కొనసాగింది చాలాసేపు.

"నిజానికి ఈ తృతీయాశ్వాసం తర్వాత మనుచరిత్ర కేవలం కథాకుతూ హలం కోసమే అయితే తప్ప రసా స్వాదనకోసం చదవాల్సిందేంలేదని నా అభిప్రాయం—" అన్నాను మిగిలిన అశ్వాసాలతో కాలం వ్యర్థపుచ్చడం ఇష్టంలేక.

"అనుకోండి కానీ ఇది పూర్తి చేశాకనే నైషధం ప్రారంభించండి " అంటూ లేచారు అన్నప్పగారు

అప్పటి కారోజు గోష్ఠి ముగిసిందన్న మాట.

నిజానికి—

నా పతకానికి అ క్షణంలోనే అంకురా ర్పణ జరిగింది.

అందుకు వాళ్ళ చేత్తోనే విత్తనం నాటించాను.

వాళ్ళ కళ్ళముందే అది మొలిచి, మొక్కయి, వేళ్ళు తన్నుకుని, పెకలించడానిక్కూడా వీల్లేనంత మహావృక్షం కావాలి.

అది అందించబోయే విషఫలాల్ని ఊహించుకుని;

ఆమూలాగ్రంగా దాన్ని పరికిపారెయ్యాలని;

తండ్రీకొడుకులు ఎత్తిపట్టుకునే గొడ్డళ్ళకి;

ఏ మాత్రం సత్తా వుంటుందో;

చూద్దామనే వొచ్చాన్నేను.

• • •

మనుచరిత్రలో మిగిలిన మూడాశ్వాసాలూ పూర్తయ్యేలోపలే, మనోజ్ఞకు నా దగ్గిర కొత్తదనంపోయి, ఏ అరమరికలూ లేకుండా మాట్లాడే చనువుకూడా ఏర్పడింది.

పేరంత మనోజ్ఞమూ ఆమె మనసు.

రూపమంత సుందరమూ ఆమె ప్రవర్తన.

చాలా సంస్కారమైన భావాలూ— పవిత్రమైన అభిప్రాయాలూ ఆమెవి.

ఆ ఇల్లూ, మహా అయితే ఆ ఊరూ తప్ప మరో పరిసరం ఊహలోనైనా ఎరగదామె. నవనవోన్మేషంగా ఎదిగిపోతున్న బయట ప్రపంచపు ఏ ముచ్చటయినా ఆమెకో వింతే. తనకింతవరకూ తెలియని నాగరిక లోకపు విశేషాలు ఆమెకు ఆకర్షణాలు. అవే పదునైన నా ఆయుధాలు.

నైషధం సాగటమే లేదు అనంతమైన కబుర్ల మధ్య. ఆమెకు ఇష్టమైన వొస్తువులపట్ల, ఆమె అభిరుచులపట్ల నేను కావాలని కనపరచే ప్రత్యేకమైన శ్రద్ధ ఆమెన్నాకు మరింత దగ్గిర చేస్తోంది. నేను ఇంట్లోవున్న ప్రతిక్షణమూ నాతోడిదే లోకం ఆమెకు. క్షణాలు, గంటలు, రోజులు మా అనుబంధాన్ని గట్టిపరుస్తూ సాగిపోతున్నాయి

కాని—

నా వయసు ప్రభావం నామీదా పని చేస్తోంది.

ఆమె నాకర్షించుకోడానికి చేసే ప్రతి ప్రయత్నమూ నన్ను మానసికంగా ఆమె వేపు లోబరుస్తోంది. వొకొక్కప్పుడనిపిస్తోంది పూర్తిగా ఆమెకు నేను లోబడిపోయానేమోనని. గుండెలోపలి జ్ఞాపకం హెచ్చరిస్తోన్నా వయసు ప్రభావానికి మనసు లొంగిపోతోంది. అంత గొప్ప అందం ఆమెది

ఆమె వొంటిమీద పడి బంగారపు మెరుగు పెట్టుకుంటున్న సాయంకాలపు పల్చటి ఎండలో పెరటి అరుగుమీద పాలబుగ్గలకి చేతులాన్చుకుని అసలే విశాలమయిన కళ్ళని మరింత వెడల్పు చేసుకొని ఎదురుచూస్తూ కూర్చునే ఆమె కోసం కళాశాల విడిచిపెట్టీపెట్టగానే ఉరుకులపరుగులమీద వొచ్చి వాలే

వాడివి ఆమె ఎదుట ప్రతిరోజూ. అలాంటప్పుడు కవీ కవసడవి చిరునవ్వుతో విశ్శబ్దంగా కళ్లతోనే ఆమె పలకరించే తీరు ప్రతిరోజూ వో వింతే నాకు

వొత్తయిన ఆమె పొడవాటి జడలో విరియాడానికే ఆ పెరట్లో ప్రతి మొక్కా పూలు పూస్తుంది కాబోలు.

ఏ రంగు బట్టయినా ఆమె వొంటి రంగుమీద విశ్లేషించడానికే నేయబడుతుంది కాబోలు

ఆమె ప్రతి కదలికా వో అద్భుత సుందర దృశ్యం.

ఆమె ప్రతీ మాటా వో మధుర మనోజ్ఞ రాగవీచిక.

ఆమె సాన్నిధ్యంలో ప్రతీక్షణం వో సుందర స్వప్నం

నా ఎడల ఆమె పరిస్థితి అంత ఉద్విగ్నంగానూ వున్నట్టు ఆమె ప్రతీమాటా ప్రతీచేష్టా ఆమె హృదయాంతరాన్ని విప్పి చెప్తున్నాయి. ఆడపిల్లల మనస్సును ఇలాంటప్పుడే గుర్తెరిగి స్వాధీన పరచుకోవాలి. అప్పుడే వేట సార్ధక్యతా వేటగాడి సామర్ధ్యమూ రుజువయేదీ, సఫలమయ్యేదీనూ.

ముందు ఆమె మనసులో వో స్థిర నిర్ణయం ఏర్పడేట్టు చెయ్యగలిగితే—

ఆటునుంచి విర్ధారణగా వొచ్చే తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కోడానికి తోడోటుంటుంది. అసలు ఆమె మనసులోవుండే ఉద్దేశం స్వరూప స్వభావాలెలావున్నాయో తెలుసుకోవాలి

ఆ చర్చకి ప్రాతిపదికగా పెళ్లిపట్ల ఆమె అభిప్రాయం రాబట్టాలని— ఆ రోజు ఎలా ప్రారంభించాలో తటపటాయిస్తోన్న క్షణాన—

"పక్కవూళ్లో ఏదో పెళ్లి సంబంధం వుందని చూట్టానికి వెళ్లారివాళ పెద నాయనగారు" ఎటో చూస్తో అంది మనోజ్ఞ. అప్పటిదాకా ఆమె ముభావంగా ఎందుకుందో అప్పటిగ్గాని అర్ధంకాలేదు. అయినా ప్రత్యేకంగా ఆ విషయం నాకు చెప్పడం ఆశ్చర్యమూ కలిగించింది. ఏమయినా నా పని సులువయిపోయింది.

"ఎగిరి గంతేసి చెప్పాలలాటి విషయం" అటుపక్క తిరిగున్న ఆమెతో అన్నాను.

"నా కిష్టంలేదు" అంటోన్న ఆమె మొహంలో ఏ భావం వుందో తెలీలేదు నాకు.

"పెళ్లా? ఆ సంబంధమా?" అన్నాన్నవ్వుతూ.

"ముక్కూ మొహం తెలీని మనిషితో ఏర్పాటుచేసే పెళ్లిళ్లపై నాకు సదభిప్రాయం లేదు అలాంటి కుగ్రామంలో, అగ్నికికూడా మడి అంటకట్టే ఛాదస్తపు సాంప్రదాయాలు అణువణువూ జీర్ణించుకుపోయిన కుటుంబంలో, మరో ప్రపంచం ఎలావుంటుందో ఊహకయినా తెలీని, పద్దెనిమిదేళ్ల ఆడపిల్లకు, అంత

తీవ్రమయిన భావం వుండటం, వింతల్లో కల్లా వింతయిన విషయం. విభ్రాంత- ఆశ్చర్యంతో మాట్లాడలేకపోయాను కొన్ని క్షణాలు

"మీరు అలా మాట్లాట్టం చాలా విచిత్రంగా వుంది." రెచ్చగొట్టే ధోరణి లోనే అన్నాను.

"వుంటుంది పితృస్వామ్య వ్యవస్థకి మీరూ ప్రతినిధులే కదా వుండదా మరి మీ వ్యవస్థలో పెళ్ళికావాల్సిన వో అమ్మాయి అలా మాట్లాడితే విచిత్రంగానూ వుంటుంది విపరీతంగానూ వుంటుంది " ఆ అనటంలో- సంఘంలో మగవాడికున్న ఆధిక్యత మీద ఆ అమ్మాయికున్న వ్యతిరేకత స్పష్టంగా ధ్వనిస్తోంది।

"నా ఉద్దేశం " నా మాట పొంతం పూర్తికానీయకుండానే,

"తెలుస్తూనే వుంది ఈ దేశంలో శాపగ్రస్తులయిన కన్యలందరికీ 'పెళ్ళి' అనే వరం ప్రసాదించి శాపవిమోచనం కలిగించడానికి అవతరించిన పురుషుల కుండాలి యిష్టాయిష్టాలూ, అభిరుచులూ అభిప్రాయాలూ అన్నీనూ. మగవాడి కనికరం కింద జీవితం సాగించాల్సిన ఆడపిల్ల ఆలా మాట్లాట్టం అసందర్భం కాదా, నేగా " పచ్చటి ఆమె మొహంలోకి ఎర్రదనం చాలా తీవ్రంగా తన్నుకొచ్చింది- ఆమె అంటోన్నప్పుడు.

"చాలా అన్యాయంగా మాట్లాడుతున్నారు మీరు. అమ్మాయి అభిప్రాయం కనుక్కోకుండా పెళ్ళిళ్లు చేసే తండ్రులూ, భార్య వ్యక్తిత్వానికి విలువ యివ్వకుండా పశువుల్లా కాపరాలుచేసే భర్తలూ- ఈ తరంలోకూడా ఉన్నారనే మీ అభిప్రాయం ఆధారంలేనిదీ, అనుభవంలేనిదీనూ " వాదంలోకి దిగుతూ అన్నాను.

"ఈ దేశంలో ఆడపిల్లల పెళ్ళిళ్లన్నీ వాళ్ళ ఇష్టాల్నుసరించే జరుగుతున్నాయంటారా।"

''వాళ్ల అభిప్రాయాలు కనుక్కోకుండా మాత్రం జరగటంలేదు "

"అబ్బాయికి నువ్వు నచ్చావట తర్రాడు లక్షణంగా వున్నాడు. నీ అభిప్రాయం ఏమిటీ' అనడగటంవూ అమ్మాయి అభిప్రాయం కనుక్కోవటమే అవుతుందా?"

"ఎందుక్కాదు? అప్పుడా అమ్మాయి చెప్పొచ్చుగా ఇష్టంలేకపోతే లేదని? "

"ప్రాముఖ్యం లేనప్పుడు చెప్పేం ప్రయోజనం?"

"వుంటుందో వుండదో నోరే విప్పకపోతే ఏం తెలుస్తుందీ ?"

'అందరూ వో నిర్ణయాని కొచ్చేసిన్తర్వాత నోరిప్పితే ఇంకేవున్నా వుందీ?

"ఆ పిరికితనానికి బాధ్యత ఎవరిదీ?"

"మాట్లాడ్డం కాదండీ ఏదీ వో అమ్మాయి ధైర్యంగా 'ఫలానా అబ్బాయి



న్నేను చేసుకుంటాను' అని చెప్పినప్పుడు చెయ్యమనండి చూద్దాం అసలా అబ్బాయిని చేసుకోమనండి చూద్దాం అప్పుడు సవాలక్ష ప్రశ్నలొస్తాయి ఆ అమ్మాయి ప్రవర్తనమీద. అదే మాట వో అబ్బాయి అన్నాడనుకోండి- అడక్కుండా వరం ఇచ్చే దేవుడిలా చూస్తారు... ఏం? పెళ్ళయేంతవరకూ ఆడపిల్ల మనసు ఏ బొమ్మాపడని అద్దంలా వుండాలి అంత సంకుచితమైన వ్యవస్థ మనది " స్థిరమైన అభిప్రాయంతో అంటున్న ఆమె అంతర్యం ఏఁవిటో నాకు అవగతం కావడంలేదు.

"ఒకపక్కే- ఊహించుకుని భయపడ్డం తప్పిస్తే- అర్థంలేదు మీ వాదనకి" రెట్టించాను తీవ్రంగా.

"ఏకపక్ష ఆమోదంతోనే జరుగుతోన్న పెళ్ళిళ్ళను చూస్తూ 'ఊహ' అనుకోవటం 'అర్థంలేదని' కొట్టిపారేయడం-పలాయనవాదం "

"నోరు మెదపకుండా ప్రతిదానికి తలొంచుకూర్చునే ఆడపిల్లలున్నంత కాలం అలానే జరుగుతాయి పెళ్ళిళ్లు "

"ఫలితం లేనప్పుడు నోరిప్పి చెడ్డవటం మినహా సాధించేదేఁవుంది?"

"వివాహం మీద ఇంత ఖచ్చితమైన అభిప్రాయాలున్న మీరు ఇన్ని కబుర్లు చెబుతున్న మీరు మీకు పెళ్లిసంబంధాలు చూస్తున్నారని తెలిసీ మీ అభిరుచుల గురించీ అభిప్రాయాలగురించీ మీవాళ్ళతో చెప్పగలిగేరా ఎప్పుడన్నా?" కావాలని రెచ్చగొట్టాను.

"మళ్లీ మొదటికే వస్తున్నారు మీరు, వొక్క తన పెళ్లి గురించి తప్ప-ప్రపంచంలో మిగిలిన ఏ ఇతరవిషయం గురించే నామాట్లాడొచ్చు ఆడపిల్ల. ఆ విషయం గురించి ఎత్తడమే సాంప్రదాయకుటుంబాలలో మహాపరాధం.

"అవన్నీ పక్కన పెట్టండి.... మీరెందుకు చెప్పలేకపోయారో అది చెప్పండి!"

"చెప్తాను, ఏదీ మరో ఆలోచన లేకుండా వొప్పుకోమనండి చూద్దాం ... వాళ్లదాకా ఎందుకూ....మీరేతట్టుకోలేరు తీరా చెప్పాక...."

"చెప్పకూడదూ ధైర్యంవుంటే!"

"వినేవాళ్లుండాలి"

"వుందో లేదో చెప్పకుండా ఎలా నిర్ణయించగలరూ!"

"సరే .. పదిహేనోజుల్నించీ అతి చనువుగా ఎరుగుదురు కదా నన్ను. నా రూపంలోగానీ, చదువు సంస్కారాల్లోగానీ, ప్రవర్తనలోగానీ ఎలాంటి లోపమూ లేదు కదూ...."

"అద్భుతంగా ఏ లోపమూ లేదు."

"నా మంచిచెడ్డా నేను నిర్ణయించుకోగలిగే వయసొచ్చింది కదా నాకూ!"

"ఆలోచించుకోగలిగే పరిజ్ఞానముంది మీకు."

"అలాంటప్పుడు నా వివాహం పట్ల నాక నిర్ణయం తీసుకోగలిగే అర్హతుంది కదా నాకూ!"

"ఆహా!"

"అయితే—పురుషుడితో సమానంగా స్త్రీకి కూడా సంఘంలో ప్రాధాన్యత వుండాలనీ, అన్ని విషయాల్లోనూ ఆమె అభిప్రాయాలకి విలువిచ్చి గౌరవించాలనీ హృదయ సంస్కారంగల గొప్ప మనసున్న—మిమ్మల్ని వివాహం చేసుకోవాలని నా అభిప్రాయం. ..ఏదీ మరో ఆలోచన లేకుండా వొప్పుకోమనండి మా వాళ్లని! ఇంకో ఉద్దేశం లేకుండా వొప్పుకోండి మీరూ!"

మెరుపు కొట్టినట్టయింది నాకు! కొన్ని క్షణాలు ఏమయ్యాయో నాకు తెలీలేదు!

ఆ అవస్థ నుంచి తేరుకునేలోపల-ఇంకోమాట కవకాశమివ్వకుండా- ఆమె అక్కణ్ణుంచెళ్లిపోయింది. చెట్ల కొమ్మల మీంచి జారిపడే వెన్నెల గాలితో పరాగాలాడుతూ ఆమె లేవి చోటులో దోబూచులాడుతోంది. ఆలోచనారహితంగా నిలబడి పోయిన నా వెనకనుంచి భుజంమీద పడిన చేతిస్పర్శకి ఉల్లిపడి వెనక్కి చూసాను. గంభీరంగా నుంచునున్నారు అన్నపూర్ణదీక్షితులుగారు. అప్పటిగ్గాని ఆమె వెళ్లిపోయిన కారణం తెలీలేదు,

"అమ్మాయిది చాలా యోగ్యమైన అభిప్రాయం. ఆ ఆలోచన మాకు కలక్కపోవటం నిజంగా అక్షేపణీయమే. మీరు ఆమోదిస్తే మీవాళ్లతో సంప్రదించేందుకు మా పెద్దబ్బాయిని పంపిస్తాను రేపే...."

ముందూ వెనకా ఆలోచించకుండా

చప్పున ఆయనా నిర్ణయానికి రావటం మరింత ఆశ్చర్యంలో ముంచేసింది. చటుక్కున-నేనేం సాధించాలని ఈ ఊరొచ్చానో గుర్తుకొచ్చి, ఇందాకట్నుంచి ఆవరించిన మత్తొదిలిపోయింది. అందుకు ఏర్పరుచుకోవాలన్న పునాది నా ప్రయత్నంలేకుండా బలంగా ఏర్పడిపోతుందని నేనూహించలేదు. అనుకున్నదానికన్నా పటిష్టంగా ఏర్పడ్డ ఈ పునాదిమీంచే నేననుకున్నది సాధించాలి అపూయికమైన మనోజ్ఞ మనోహర రూపం కళ్లముందు నిలిచింది. పదిహేనేళ్లుగా పెరుగుతోన్న కఠినమైన నా నిర్ణయం దేనికీ లొంగదు. చివరిదాకా తీసికెళ్లి విజృంభిస్తే ప్రత్యర్థులకు ఏంచెయ్యాలో తోచక కరచరణాలు ఆడకుండా చెయ్యాలి. ఆ అవస్థ పదిమందీ చూడాలి. యుగాలనుంచి తలెత్తుకు తిరిగిన జాత్యహంకారపు పొగరు తలదించుకోవాలి.

"చెప్పారు కాదు ఏ విషయమూ?" రామచంద్ర దీక్షితులుగారి గొంతు విని ఉలిక్కిపడ్డాను. నా చుట్టూ తండ్రీ ముగ్గురు కొడుకులూ. అందరూ కలిసే విన్నారన్నమాట మా సంభాషణం అంతానూ

"నాకు సంబంధించిన ఏ విషయం గురించయినా నా తరపున ఆలోచించి నిర్ణయం తీసుకునేవాళ్లెవరూ మిగల్లేదు"

నేనన్న ముక్కకి ఎక్కువగా ఆశ్చర్యపోయిన అన్నప్పదీక్షితులుగారు "మీ తల్లిదండ్రులు...." నా వంక చూస్తూ.

"తల్లి నాకో ఊహ మాత్రమే. నా పదో ఏట మా తండ్రిగారు నన్ను ఏకాకిని చేసారు.. " ఆ విషయం గుర్తుకు రాగానే నా కళ్లు ఎరుపెక్కాయి. గుండెల్లో జ్ఞాపకం తీవ్రంగా బయటికొచ్చింది. తమాయించుకున్నాను.

"మీ గురించి ఏ విషయమూ ఇన్నాళ్లయినా విచారించనందుకు మన్నించాలి" సూరన్న దీక్షితులుగారు నొచ్చుకుంటూ అన్నారు. అసలు విషయం తెలిస్తే తిరగబడతారు. నే నెదురుచూస్తోంది అందుకోసమే.

"నాఅన్నవాళ్లుగానీ, నాదంటూ చిల్లిగవ్వ ఆస్థిగానీ లేవు నాకు...." నా మాట పూర్తికాలేదింకా—

"మేంవంతా మీవాళ్లమే.. ఆ ఆలోచన పెట్టుకోకండి....మా మనోజ్ఞ మీకు నచ్చితేచాలు "లక్ష్మీనారాయణ దీక్షితులుగారన్న 'నిజమైన' మాటకి అనుకోకుండా చిన్న నవ్వొచ్చింది నాకు ఆ ఆనరాతో

"శుభం . మా ఏర్పాట్లు మేం కానిస్తాం ఈ శ్రావణంలోనే ముహూర్తం నిర్ణయిస్తే బాగుంటుంది" చౌరవగా సూరీడుగారన్న మాటకి కావలని వహించిన నా మౌనం అంగీకారంగా భావించి-

"పూర్ణయ్యసిద్ధాంతిగారికి కబురుపెట్టి ఊళ్లో పెద్దల్ని ఆహ్వానించండి-ముహూర్తం నిర్ణయిద్దాం" కొడుకుల్ని ఆజ్ఞాపిస్తూ

కదిలారు అన్నప్పదీక్షితులుగారు.

అసలు రంగం అంతా అప్పుడే ప్రారంభమవుతుంది. ఆ సుముహూర్తం కోసమే వొచ్చా నేను.

వొంటరిగా ఆ యుద్ధాన్నెదుర్కోడానికి సన్నద్ధమయే వున్నాన్నేను!

* * *

తన ఇంట్లో వీధి అరుగులమీద ఆసీనమైవున్న అగ్రహారపు బ్రాహ్మణ్యాన్నుద్దేశించి—తల పెట్టిన తమ మనుమరాలి వివాహసంకల్పమూ కావించిన వరనిర్ణయమూ వివరించి—గర్వంగా సదస్యులకు వరపరిచయం చేసారు అన్నప్పగారు. లాంఛనప్రాయంగా, తమ్ముడిచేత చందన తాంబూలా లిప్పించి నిశ్చితార్థం కావించారు రామచంద్రుడుగారు. సుముహూర్త నిర్ణయం కాగానే కార్యం నిర్విఘ్నంగా జరిగేట్టు ఆశీర్వదించి తాంబూలాలు తీసుకువెళ్లవలసిందిగా వేదవిదులైన పెద్దలను కోరుతూ సిద్ధాంతిగారి వంక చూసారు లక్ష్మీనారాయణగారు. 'శుభం' అంటూ పంచాంగం సర్దుకుని సిద్ధాంతిగారు—

"బాబూ, తమ జన్మనక్షత్రం, వంశ గోత్రం, పితృపితామహుల నామధేయాలు శెలవియ్యండి." అంటూ నా వంక చూసారు. వొక్కసారి అందరివేపు చూసాను. అందరి ముఖాలూ తేజస్సుతోనూ, తాంబూలాస్వాదిత అధరాలు ఎర్రటిచిరునవ్వులతోనూ ప్రకాశించుతూ వున్నాయి. తలుపుల కవతల గాజులగలలు మధురంగా వినిపిస్తున్నాయి. గొంతు సర్దుకుని "జననకాలం, జన్మనక్షత్రాలే కాదు, కులగోత్రాలేవిటో; జన్మ ఇచ్చిన తల్లి తండ్రు లెవరో కూడా తెలీదు నాకు" అవగానే—కూర్చున్నవాళ్లందరి పక్కల్లోనూ బాంబులు పడ్డట్టు హాహాకారాలు చేసారు. ఏవిటీ వరనిర్ణయం(వూ? అన్నట్టు అన్నప్పగారి వంక హేళనగా చూసింది బ్రాహ్మణ్యం యావత్తూ. పచ్చటి వదనంతో ప్రకాశిస్తోన్న అన్నప్పగారి ముఖం వొక్క క్షణంలో అగ్నిగోళమయిపోయింది. కుతకుతలాడిపోతున్నారు కొడుకులు. వాతావరణం అంతా బీభత్సంగా తయారయింది.

"మరి—వాజపేయయాజుల వారబ్బాయి నని..." కోపంతో వొణికిపోయింది లక్ష్మీనారాయణగారి గొంతు—

"ఆ(—" అంటూ వూగిపోయారు అన్నప్పగారు.

"అవును, మనసా వాచా నన్ను దగ్గరికి తీసిన వాజపేయయాజుల కాశీదీక్షితులుగారి మానస పుత్రుడి న్నేను...." గుండెల్ని చీల్చుకొచ్చిన నా మాటలు అక్కడున్నవాళ్లందర్నీ పాతికేళ్లు వెనక్కి తోసుకెళ్ళాయి.

"అంటే..." ముక్తకంఠంతో అరిచారందరూ. ఇన్నేళ్లబట్టీ నే నెదురుచూస్తోన్న ఘడియ ఇదే.

"పాతికేళ్ల క్రితం ఇటు ఊరికి అటు

మాటవాడకి సరిహద్దుగా వున్న చింతల తోపుల్లో దిక్కులేక పడివున్న పదిరోజుల పసికందును ఇటు ఊరుగానీ అటు వాడగానీ చేరదీయడానికి వెనుకాడుతోన్న క్షణాల్లో, నిత్యాగ్నిహోత్రులూ, శిష్టాచారపరాయణులూ, శ్రీ అన్నప్పదీక్షితులుగారి మేనత్తకుమారులూ అయిన బ్రహ్మశ్రీ కాశీదీక్షితులుగారు మానవతా హృదయంతో చేరదీసినందుకూ, దేవుడిచ్చిన బిడ్డగా పెంచి తీరతానన్నందుకూ, ఈ ఊరి బ్రాహ్మణ్యం అంతా ఆయనన్నంత రానివాడుగా ఎంచి వూర్లో మంచినీళ్లయినా పుట్టకుండా వెలివేసింది తను చేసిన పని పనస్కాళనకమయిందన్న భావంతో ఊరూవాడని ఎదిరించి ఆ పసికందును పదేళ్లు వొంటరిగా సాకి, అనుకోని జబ్బుకులోనై అవసానక్షణాల్లో తన పదేళ్ల మనుకారాన్ని వెంటపెట్టుకుని వొచ్చి, అభంశుభం తెలియని ఆ పిల్లవాడిని దయతో చేరదీయమని బావగారైన అన్నప్పగారి కాళ్లావేళ్లాపడినా కరగని అన్నప్పగారి కర్కశత్వానికి ప్రాణాలొదిలిన కాశీగారి అభిమాన పుత్రుడిన్నేను. నడివీధిలో పడివున్న శవాన్ని తాకటానికి కూడా వీల్లేదని నిర్ణయించుకున్నప్పుడు, మోసుకెళ్లడానికి శక్తిలేక స్మశానానికి ఈడ్చుకుంటూ తీసుకెళ్లి కంపాకర్రా ఆకూ అలమూ ఏరి దహనంచేసిన పదేళ్ల కుర్రాడిన్నేను. పగవాళ్లయినా కలలోకూడా తలపెట్టని ఘోరం తలపెట్టిన ఈ ఊరి ఛాదస్తపు బ్రాహ్మణ్యం మీద అసహ్యం, మేనత్తకొడుకుపోయినా అతనిమీద వెలిచేత మైలకూడాపట్టని సంకుచిత మనస్కులైన అన్నప్పగారిమీద కసి, కోపం-కాశీగారికి జరిగిన ఘోరానికి తగిన ప్రతీకారం చేసితీరాలనే నిర్ణయం. వీటన్నిటినీ గుండెల్నిండా మోసుకుని ఆనాడు ఊరు విడిచిపెట్టిన నేను, అష్టకష్టాలూ అనుభవించి, అకుంఠితదీక్షతో అన్నిశాస్త్రాలూ అభ్యసించి, ఉత్తీర్ణుడనై కావాలని ఈ ఊరు వేయించుకునొచ్చాను. అన్నప్పగారిమీద పగ తీర్చుకోవాలని నా విద్యానైపుణ్యంతో ఆయన్ని మెప్పించి వాళ్ల ఇంటిలోనూ హృదయాల్లోనూ తిష్ట వేసాను. మాటతీరూ, వేషభాషలూ చూసి కులం, గోత్రం విచారించకుండా తన మనుమరాలిని నాకిచ్చి పెళ్లిచెయ్యడానికి సిద్ధపడ్డ అన్నప్పగారిని పదిమందిముందూ పరాభవించడమే నా ప్రతీకారం. నాకూ, శ్రీ అన్నప్పదీక్షితులుగారికి మాత్రమే తెలిసున్న నా జన్మరహస్యం వొక్కటీ సదస్యులకు తెలియచేస్తేనే నా ప్రతీకారం పూర్తిగా నెరవేరినట్లవుతుంది."

"ఆపు! ఆపు నీ అసందర్భపు ప్రేలాపనలు ప్రాణాంతో బయటపడు ఇక్కణ్ణుంచి గుమ్మం దిగు ముందు...." పిచ్చిగా అరుస్తోన్న అన్నప్పగారి ముఖంలోంచి నిప్పులురుకుతున్నాయి.

"అరచినంత మాత్రంచేత నిజాలు మరుగునపడిపోవు అన్నప్పగారూ. మీ

చెల్లెలు శ్రీదేవమ్మగారి పుత్రరత్నం మార్తాండదీక్షితులుగారికి మాలవాడలోని కన్నెపిల్ల ముత్యాలుకీ వున్న అక్రమ సంబంధానికి ఫలితాన్ని నేనని మీకూ కాశీగారికీ మాత్రమే తెలుసును. వెలివేసి మంచినీళ్లు పుట్టకుండా చేసినా కాశీగారా విషయాన్ని నాకు కూడా తెలియనీకుండా గుండెల్లోదాచుకున్నారు. ఆ విషయం పైకి పొక్కితే మీ బ్రాహ్మణ్యం మంటగలిసి పోతుందని ముత్యాలు నోరు నొక్కేయించేసారు. జారిపోతోన్న చెడ్డీని పైకెగదోసుకుంటూ, కాటికి కాళ్ల మీద శవాన్ని తాడుకట్టి లాక్కెళ్ళలేక లాక్కెళ్తూ, అవస్థపడే పదేళ్ల కుర్రాణ్ణి చూసి మీ గుండె కరగలేదు. కన్నుమూస్తే మీ బ్రాహ్మణ్యం ఎక్కడ మంటగలిసిపోతుందోనని నిద్రలో కూడా కళ్లు తెరుచుకునే బ్రతుకుతున్నారు. మనిషికి మన్ననిచ్చేది కులమూ ఆచారాలూ కావు అన్నప్పగారూ గుణమూ సంస్కారాలు అని నిరూపించడానికే పదిహేనేళ్లు అవిరామంగా కృషి చేసాను. ఈ శిష్టాచారాలూ, సనాతన ధర్మాలూ హృదయం సంస్కారం లేనప్పుడు వ్యర్థమని చెప్పడానికే వొచ్చాను. ఈ కులీనుడికి పిల్లనిచ్చి మరోసారి మైలపడకండి, శెలవ్..." నోరెళ్లబెట్టి వింటోన్న ఆ ఊరి బ్రాహ్మణ్యం వేపూ, ఇంటి అరుగుకి నూరుగజాల దూరంలో ముష్టికులమీద కూర్చున్న ఇతర జనాన్ని కలయచూసి బరువెక్కిన గుండెలతో మెట్లుదిగుతోన్న నా వెనకనుంచి. "ఆగండి" అన్న గొంతు విని, ఆఖరి మెట్టుమీద నుంచొని వెనక్కి తిరిగి చూసాను. మనోజ్ఞ!

"మనసారా మిమ్మల్నే వివాహం చేసుకోవాలన్న నా నిర్ణయం మారలేదు_ మారదు_" అందామె పైమెట్టుమీదనుంచుని.

"ఆ వెధవతో మాట్లాడ్డానికి నీకు సిగ్గన్నా వెయ్యటంలేదూ? పరువు మంటగలపక లోపలికెళ్లు నువ్వు" రెక్కపట్టుకుని లోపలికి తీసుకెళ్లబోయారు కూతుర్ని సూరీడుగారు.

"పరువు గురించి మాట్లాడే అర్హత మనలో వొక్కరికీ లేదు నాన్నగారూ. ఈ విషయాలేవీ ఆయన బైటపెట్టకపోతే ఆయనకిచ్చి వివాహం చెయ్యడానికి లేని అభ్యంతరం ఇప్పుడెలా వొచ్చిందీ? అయినా వివాహం చేసుకునేది నేను. నా నిర్ణయంమీద నాకు నమ్మకం వుంది." అంటూ రెక్క విదిలించుకుని నావంక చూస్తూ "మీ నిర్ణయం చెప్పలేదు." అందామె.

"దిగువనున్నవాడిని నేను. పై మెట్టుమీద వున్నారు మీరు. మిమ్మల్ని చేరుకోడానికి మెట్లెక్కే అర్హత నాకు లేదంటున్నారు మీవాళ్లు. నన్ను అందుకోడానికి మెట్లుదిగి మీరే రావాలి. దానికి ఆలోచించవలసింది మీరు..." నా మాటింకా పూర్తికాలేదు, ఎంత వెంగున దిగిందో మరి మనోజ్ఞ నా పక్కనుంది.

మరోక్షణంలో_

నడిచెళ్తున్న మాయిద్దర్నీ చూసి_ఊరు—ఊరంతా నోరెళ్లబెట్టి వుండిపోయింది.

మా కొత్తజీవితానికి_ సుస్వాగతంగా గుడిలో ఎవరో గంట కొట్టారు!!

---